క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ మట్టెవాడ ఏఈ మహేందర్ తెలిపారు. హంటర్ రోడ్డు ఫీడర్‌లోని రామన్నపేట, రామా టాకీస్, రాజీవ్ గాంధీ విగ్రహం, బట్టల బజార్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో వివరించారు.

నేత్రదానంతో అంధులకు చూపు

రామన్నపేట: నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చని శరీర, నేత్ర, అవయవ దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. వరంగల్ దేశాయిపేటకు చెందిన ఐబీఎం సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గాండ్ల సునీల్‌కుమార్(40) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, భార్య అనూష, సోదరి మమత, రాజేష్ అనుమతితో మృతుడి నేత్రాలను వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది, ఎల్వీ ప్రసాద్ నేత్ర నిపుణులు సేకరించారు.

పోలీసులకు హెల్మెట్ల పంపిణీ



వరంగల్ క్రైం: ట్రాఫిక్ పోలీసులకు యాక్టు ఫైబర్ నెట్ యజమాన్యం హెల్మెట్లను అందజేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు తెలిపారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుజాత, వరంగల్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, యాక్టు ఫైబర్ నెట్ ప్రతినిధులు ఎస్.సందీప్, ఎండీ.జాకీర్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతలో అన్ని సమాధానాలు



వరంగల్: నిత్యజీవితంలో మానవుడికి వచ్చే అన్ని ప్రశ్నలు, సందేహాలకు భగవద్గీతలో సమాధానాలు దొరుకుతాయని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ అన్నారు. సప్త గురుధామంలో ఆదివారం ఏర్పాటు చేసిన భగవద్గీత శ్లోక పఠన పోటీల్లో ఆయన మాట్లాడుతూ భగవద్గీతలోని అన్ని అధ్యాయాలపై గురుదేవులు శివానందమూర్తి ప్రసంగాలు చేశారని గుర్తుచేశారు. పోటీల్లో సుమారు 60మంది పిల్లలు పాల్గొని భగవద్గీత శ్లోక పఠనం చేశారని తెలిపారు. అనంతరం, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా రిటైర్డ్ హెచ్ఎం స్వానాధాచార్య, గంగిశెట్టి శ్రీవిద్య వ్యవహరించగా, కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, సాంబమూర్తి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేను కలిసిన కాంగ్రెస్ బృందం

హన్మకొండ చౌరస్తా: న్యూఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ బృందం ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసింది. చేవెళ్ల సభ డిక్లరేషన్‌లో పేర్కొన్న ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభ్యున్నతిపై ఆరు నెలల పాటు కసరత్తు చేసి తీసుకున్న పలు నిర్ణయాలను ఖర్గేకు వివరించినట్లు ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్, బృందంలో ఒకరైన డాక్టర్ పులి అనిల్‌కుమార్ తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కొత్తగా ఐదు ఐటీడీఏలు, 9 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, ఎస్సీల రిజర్వేషన్లు 18శాతానికి పెంపు, అంబేడ్కర్ అభయ హస్తం లాంటి అనేక పథకాల అమలు, సాధ్యాసాధ్యాలపై వివరించినట్లు వివరించారు.

అక్టోబర్ 4న ఆత్మగౌరవ సభ



హన్మకొండ చౌరస్తా: దళితుల్లో వెనుకబడిన 57 ఉపకులాల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 4వ తేదీన హైదరాబాద్‌లో లక్ష మందితో నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి బైరి వెంకటేశం మోచి పిలుపునిచ్చారు. హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో సమితి రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో టీఎస్ స్వామి, మిత అయ్యాల్వార్, రాయిల లక్ష్మి, నర్సయ్య, ఆదిమూళ్ల వెంకటేష్, హోలియా దాసరి, తుల సీదాస్, రామారావు, మటపతి, ధర్మయ్య తదితరులు హాజరయ్యారు.

జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు

హసన్‌పర్తి: రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా కార్యవర్గంలో హసన్‌పర్తికి చెందిన ఇద్దరికి చోటు లభించింది. హసన్‌పర్తి పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాడి మల్లారెడ్డిని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బండా రత్నాకర్‌రెడ్డిని జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈమేరకు రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు అర్జున కిషన్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

మా మిషన్లు పగులగొట్టండి

- లింగ నిర్ధారణ యంత్రాలు నిర్వహణలో లేవంటూ ఆస్పత్రుల మొర
- దరఖాస్తులపై స్పందించని వైద్యారోగ్యశాఖ
- ఏడాదిన్నరగా మూలుగుతున్న అప్లికేషన్లు
- పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌లో కొరవడిన స్పష్టత
- దుర్వినియోగమయ్యే అవకాశం ఉందనే భావన



సాక్షి, వరంగల్ :

- వరంగల్ సన్‌షైన్ ఆస్పత్రిలోని లింగ నిర్ధారణ పరీక్షల మిషన్ పనిచేయక రెన్యూవల్‌కు దరఖాస్తు ఇచ్చారు. అలాగే, ఆ మిషన్‌ను క్రాష్ (పగులగొట్టడానికి) చేయడానికి అనుమతివ్వాలని వైద్యారోగ్యశాఖకు అర్జీపెట్టుకున్నారు.
- వరంగల్ బాలాజీ ఆస్పత్రిలో 2001 నుంచి స్కానింగ్ ఉంది. ప్రస్తుతం వారు వాడుతున్నది మూడో మిషన్. రన్నింగ్‌లో లేని రెండు మిషన్లను ధ్వంసం చేస్తామని దరఖాస్తు పెట్టుకోగా.. పెండింగ్‌లోనే ఉంది.
- వరంగల్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి లింగ నిర్ధారణ చేసే మిషన్ ఉంది. ఆస్పత్రిని హనుమకొండకు మార్చిన సమయంలో పాత ఆస్పత్రిని మూసివేశామని, మిషన్ వాడలేము.. క్రాష్ చేయాలని వేడుకున్నారు.
- వరంగల్, హనుమకొండ జిల్లాల విభజనలో భాగంగా వరంగల్ జిల్లాకు రెండు కోర్టు కేసులతో ఉన్న ఆస్పత్రులు వచ్చాయి. వీటిలోని స్కానింగ్ మిషన్లు ఇప్పుడూ పనిచేయని స్థితిలో ఉన్నాయి.

...ఇలా వివిధ కారణాలతో లింగ నిర్ధారణ పరీక్షలు చేసే మిషన్లను పగులగొట్టేందుకు అనుమతివ్వాలని కొందరు దరఖాస్తు చేసుకుంటే.. ఇంకొందరు తమ వద్దకు ఏ కేసులు వస్తలేవంటూ ప్రతి నెలా జిల్లా వైద్యారోగ్యశాఖకు పంపే ఎఫ్ అడిట్ ఫాంలో విన్నవిస్తున్నారు. అయితే ఏడాదిన్నర నుంచి వినతులు ఇస్తున్నా చర్యలు తీసుకోవడంలో అడుగు ముందుకు వేయడంలేదు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ కింద రన్నింగ్‌లో లేని మిషన్లపై చర్య తీసుకునే విషయమై ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. స్టేట్ రిజిస్ట్రేషన్ వ్యాలిడిటీ ఉన్నంత వరకు ఆ మిషన్ల ఫంక్షనింగ్ ఉండడంతో జిల్లాస్థాయిలో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. రాష్ట్ర వైద్య ఉన్నతాధికారులకు విన్నవించినా చట్టంలో స్పష్టత లేక ఈ మిషన్లను ఏం చేయాలన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాలని వైద్యవర్గాలు కోరుతున్నాయి.

జిల్లాలో పనిచేయని మిషన్లు 34..

పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ కింద 2001 నుంచి అల్ట్రా సౌండ్ స్కానింగ్ క్లినిక్‌లు, ఇమేజింగ్ సెంటర్లు ఇప్పటివరకు 102 రిజిస్టర్ అయి ఉండగా.. 68 మాత్రమే నడుస్తున్నాయి. మిగిలినవి 34 రన్నింగ్‌లో లేవు. అయితే వీటిలో జిల్లా విభజనలో వరంగల్ అర్బన్ నుంచి కొత్త వరంగల్ జిల్లాలో చేరిన వరంగల్, ఖిలావరంగల్ మండలాలకు చెందినవే 22 ఉన్నాయి. ప్రతి నెలా ఐదో తేదీన జిల్లా వైద్యారోగ్య విభాగానికి వచ్చే ఎఫ్ అడిట్ ఫాంలో పనిచేయని మిషన్ల వివరాలు వస్తున్నాయి. వీటిపై వైద్య విభాగాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అవి వాస్తవంగా పనిచేయడం లేదా.. ఏమైనా లింగ నిర్ధారణ పరీక్షలు జరిగే అవకాశం ఉందా అన్న దిశగా దృష్టి సారించాలని ఇటీవల కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఆరోగ్యశ్రీ కోసమే అక్కడ మిషన్లు..

ఆప్తామాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్ వైద్యం అందించే ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వర్తించాలంటే పీసీ పీఎన్‌డీటీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి కావడంతో ఆ మిషన్లు తీసుకుంటున్నారు. ఇలా దాదాపు 10లోపు మిషన్లు ఉన్న ఆస్పత్రుల యాజమాన్యాలు అవి రన్నింగ్‌లో లేవని చెబుతున్నాయి. ఇలాంటివి దుర్వినియోగం అయ్యే అవకాశమూ ఉందని తెలుస్తోంది. అందుకే వాటిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాల్సిన అవసరం ఉందన్న వాదన వినిపిస్తోంది.

రాష్ట్రస్థాయిలో పాలసీ తేవాలి..



నిర్వహణలో లేని స్కానింగ్ మిషన్ల సెంటర్ల లైసెన్స్ రద్దు చేయాలి. ఆ మిషన్‌ను సీజ్ చేసి పరిశ్రమకు లేదా.. ఇతరులు ఎవరైనా కొనుగోలు చేసుకుంటే ఇచ్చేలా డీఎంహెచ్‌ఓ ద్వారా జరిగేలా చూడాలి. దీనిపై రాష్ట్రస్థాయిలో తెలంగాణ వైద్యారోగ్యశాఖ పాలసీ తీసుకురావాలి. తిరిగి లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. స్కానింగ్ మిషన్లు తయారు చేసే పరిశ్రమలను కూడా పీసీ పీఎన్‌డీటీ చట్టంలోకి తేవాలి.

\- మండల పరశురాములు,
అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు

ముస్లిం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



కుట్టు మిషన్లను పరిశీలిస్తున్న చీఫ్ విప్

న్యూశాయంపేట: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో హనుమకొండ లష్కర్ బజార్‌లోని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న స్కిల్ డెవలప్‌మెంట్, గార్మెంట్, ప్రొడక్షన్ సెంటర్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వివరించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో శిక్షణ కార్యక్రమాలపై సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని చీఫ్ విప్‌ను ప్రతినిధులు కోరారు. సొసైటీ కార్యదర్శి సిరాజ్ అహ్మద్, సభ్యులు, అక్బర్‌జియా, సలీం పాల్గొన్నారు.

ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతా..



నిత్యావసర కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: భగత్‌సింగ్‌నగర్ కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. నగరంలోని రెండవ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ కాలనీలో వరద బాధితులకు బాల వికాస, అమెజాన్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు చేయూత నివ్వాలని పిలుపునిచ్చారు. వరద ముంపునకు గురికాకుండా ఉండేందుకు శాశ్వత పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కాలనీలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించడానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు మేర్గు రాజేష్‌గౌడ్, జక్కు రమేష్, వనంరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గనిపాక విజయ్‌కుమార్, నాయకులు చింతం శ్రీనివాస్, మంద భాస్కర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి

హసన్‌పర్తి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి మొబైల్ ఫోన్‌కు వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని అన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరంగా పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలబాలికలను పనిలో పెట్టుకోవద్దని, బడీడు పిల్లలకు బడిలో చేర్పించాలని సూచించారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అమితారెడ్డి, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జీవన్‌రెడ్డి, ఉపసర్పంచ్ సాయిలు, ఎస్సై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



మొదటి బోనం సమర్పిస్తున్న శేషుభారతి

మడికొండ: శ్రావణమాసం సందర్భంగా 46వ డివిజన్ మెట్టుగుట్ట వద్ద ఉన్న పోచమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కార్యనిర్వాహణాధికారి శేషుభారతి మొదటి బోనం సమర్పించారు. భక్తులు అధికా సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.



కాశిబుగ్గ: అభిషేకం చేస్తున్న అర్చకులు

రంగనాథస్వామికి అభిషేకం

కాశిబుగ్గ: శ్రావణమాస ఏకాదశిని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్ఛరణ మధ్య పంచామృతాలతో అభిషేకం చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణామాచార్యులు, రామాచార్యులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న దీప

హన్మకొండ: మతోన్మాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యురాలు ఎల్.దీప సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో హనుమకొండ వరంగల్ పశ్చిమ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది మతాలు, కులాల పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను చీల్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి కుల, మత రాజకీయాలు ప్రమాదకరమని హెచ్చరించారు. మత ఉన్మాదులను దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వాంకుడోతు వీరన్న, నాయకులు కుక్కముడి రవీందర్, వల్లెపు లింగమూర్తి, వల్లెపు రాజు, కూస రాజేష్, రజిత, అర్షియ, రమాదేవి, స్వప్న, సంపూర్ణ, మురళి, వినయ్ పాల్గొన్నారు.

‘వడుప్సా’ వరంగల్ కమిటీ ఎన్నిక

కరీమాబాద్: వడుప్సా (ట్రస్మా) వరంగల్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనున్నుకున్నారు. గ్రేటర్ పరిధిలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా అంకటి వీరస్వామి, గౌరవ అధ్యక్షుడిగా ఆడెపు శ్యాం, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా అక్కినపల్లి సతీష్‌కుమార్, సలహాదారుడిగా కోడం శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గాన్ని జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించినప్పుడు ఎన్నుకోనున్నట్లు ఎన్నికల కన్వీనర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో బిళ్ల రవి, ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, ఆడెపు వెంకటేశ్వర్లు, పొన్నోజు చక్రపాణి, ముక్కెర రవీందర్, దాసి సతీష్, కూరపాటి మోహన్, కూచన క్రాంతికుమార్, కొడిమెల రవి, కిరణ్, శరత్, శ్రీనివాస్, వెంకట్రాజం, ప్రసాద్, సురేష్, రిజ్వాన్ పాల్గొన్నారు.



వడుప్సా నూతన కమిటీ బాధ్యులు

విద్యార్థి దశలో ఇంటర్ విద్య కీలకం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హన్మకొండ: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలకమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ అన్నారు. హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని రెడ్డి మ్యారేజీ హాల్‌లో రామప్ప జూనియర్ కళాశాల అద్వితీయ -2023 వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ర్యాగింగ్ వంటి సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో రామప్ప అకాడమీ డైరెక్టర్ చంద్రమోహన్ గౌడ్, కళాశాల డైరెక్టర్ ఐలి కరుణాకర్ గౌడ్, తేజస్వి, నాగేశ్వర రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఏవీవీలో భగవద్గీత పఠన పోటీలు



రామన్నపేట: మురళీకృష్ణ మందిరం 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లోని ఏవీవీ విద్యాసంస్థలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకపఠన పోటీలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ పోటీలకు 62 పాఠశాల నుంచి 2వేల మంది విద్యార్థులు పాల్గొని భగవద్గీతలోని ఎంపిక చేసిన శ్లోకాలను చదివి వినిపించారు. ముఖ్యఅతిథిగా ఏవీవీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. ఏవీవీ ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్‌రెడ్డి, నిర్వాహకులు గందె శ్రీనివాస్, సంజీవరావు, కూర అంజయ్య, వెలంగందుల భాస్కర్, డాక్టర్ బండారు బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు మండల కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: మాల మహానాడు హసన్‌పర్తి మండల కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతరాజు ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా సాదు కుమారస్వామి, జోరిక మల్లేశం, ప్రధాన కార్యదర్శులుగా దండ్రి సాంబయ్య, కాందారి రాజ్‌కుమార్, కోశాధికారులుగా పప్పుల గణపతి, తిరుపతి, గౌరవ సలహాదారులుగా పప్పు భిక్షపతి, చుక్క ప్రభాకర్, గరిగె మురళి, కోఆర్డినేటర్‌గా దండ్రి శ్రీనివాస్‌లతో పాటు ఆరుగురు సహాయ కార్యదర్శులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులు, ఇద్దరు సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లను ఎన్నుకున్నారు.

ఆదర్శ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

హన్మకొండ: హనుమకొండ ఆదర్శకాలనీలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మహిళా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ బచ్చు వీణ పాల్గొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలకు గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా చేశారు. పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా ఆరోగ్య వికాస విభాగం అధ్యక్షుడు డాక్టర్ రాధాకృష్ణ, ఇమ్మనేని సుందర్ రావు, రోజారాణి, సుభాషిని, దయాకర్ రెడ్డి, ఆదిరెడ్డి, తిరుమలరావు, నరసింహస్వామి, విద్యాసాగర్ రెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

హన్మకొండ: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడిని తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి గోపీ గౌడ్, నాయకులు పరామర్శించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు వంగ యాదగిరి గౌడ్.. వృత్తిలో భాగంగా శనివారం తాడిచెట్టు ఎక్కి కళ్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారికింద పడి తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని సంఘం నాయకుల ఆదివారం పరామర్శించారు.

బాధిత కుటుంబానికి చేయూత

హసన్‌పర్తి: ఇటీవల మృతి చెందిన మునిపల్లికి చెందిన నద్దునూరి శ్రీకాంత్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకుడు చుంచు రవీందర్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి బియ్యం అందజేశారు. పోలెపల్లి రవి, సందెల రవీందర్, నాగరాజు, సుధాకర్, కోర్నెల్, బుచ్చిరెడ్డి, భిక్షపతి, సత్యం, కిషన్, రమేష్ పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో గణపతి నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రికను భక్తుల చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. శ్వేతార్కుడికి ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరగనున్న వినాయక ఉత్సవాల కార్యక్రమాల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఆలయ పరిపాలన నిర్వాహకులు సాయికృష్ణ శర్మ, ఆలయ మేనేజర్ ఎల్.రవి, పీఆర్వో మణిదీప్, అయినవోలు వెంకటేశ్వర శర్మ, కందికోట శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

అమిత్‌షాను కలిసిన ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన ‘రైతు గోస – బీజేపీ భరోసా’ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమిత్ షాను సన్మానించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

వరంగల్: 14వ డివిజన్ బాలాజీనగర్, సుందరయ్య నగర్, ముసలమ్మకుంట, ఎస్సార్‌నగర్‌కు చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడువ మహేష్ తెలిపారు. హనుమకొండలోని వర్ధన్నపేట నియోజకవర్గం రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, కాంగ్రెస్ నాయకుడు కేఆర్.నాగరాజు స్వగృహంలో 14వ డివిజన్ బీఆర్ఎస్ యూత్ నాయకుడు కుంభం శివపటేల్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో ఆదివారం చేరగా, వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కాజీపేట: పలువురు ఐటీ రంగ నిపుణులు జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాజీపేట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆదివారం సాయంత్రం ఆహ్వానించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐటీ రంగం అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆకర్షితులైన పలువురు పార్టీలో చేరడం అభినందనీయమని అన్నారు. జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యులు సుంచు కృష్ణ, మాజీ కార్పొరేటర్ అశోక్, నాయకులు నార్లగిరి రమేష్, రంజిత్‌కుమార్, శివకుమార్, రఘు, మహమూద్, ఫర్హాన్, మల్లేశం పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన బీజేపీ శ్రేణులు

హసన్‌పర్తి: ఖమ్మం జిల్లాలో ఆదివారం నిర్వహించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సభకు హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్పొరేటర్లు శివకుమార్, రవినాయక్, అరుణకుమారి, డివిజన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.

కాజీపేట అర్బన్: ఖమ్మంలోని అమిత్‌షా బహిరంగ సభకు కడిపికొండ నుంచి బీజేపీ నాయకులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఈమేరకు మాజీ ఎంపీపీ మాకుల రవీందర్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ 45వ డివిజన్ అధ్యక్షుడు చెన్నబోయిన శివకుమార్, రామకృష్ణ, శివ, సతీష్, యాదగిరి, నాగరాజు, శ్యాం, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


హైదరాబాద్‌కు తరలిన పెరిక కులస్తులు

హన్మకొండ: హైదరాబాద్ కోకాపేటలో ఆదివారం జరిగిన పెరిక కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమి పూజకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పెరిక కులస్తులు హనుమకొండ నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ పెరిక సంఘం రాష్ట్ర లీగల్ సెల్ ఇన్‌చార్జ్ సాయిని నరేందర్ మాట్లాడుతూ కుల ఆత్మగౌరవ భవనానికి రెండెకరాల స్థలం, రూ.రెండు కోట్లు కేటాయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. యాత్రలో వరంగల్ జిల్లా పెరిక సంఘం ఉపాధ్యక్షుడు బరుపటి యాకయ్య, నాయకులు సుందర్ రామ్, కొమురయ్య, గొర్రె నాగరాజు, గాండ్ల నరేందర్, గడ్డం రమేష్, బరుపటి మధు, గడ్డం శ్రీనివాస్, చింతం విజయ్, వక్కల రాజు పాల్గొన్నారు.

పథకాల అమలు పేరుతో మోసం

హసన్‌పర్తి: పథకాల అమలు పేరుతో ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీ సర్పంచ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ అనిల్ అన్నారు. బీజేపీ హనుమకొండ, హసన్‌పర్తి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం పలివేల్పులలో శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా పూర్ణచందర్



కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని శంభునిపేట పద్మశాలి సంక్షేమ పరపతి సంఘం అధ్యక్షుడిగా గుండు పూర్ణచందర్ ఎన్నికయ్యారు. రంగశాయిపేటలో ఆదివారం జరిగిన సంఘం 22వ వార్షికోత్సవ సమావేశానికి తుమ్మ శంకరయ్య అధ్యక్షత వహించగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలకు పరపతి సంఘాలు ఎంతో ఉపయోగపడుతాయని, ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. ఈక్రమంలోనే సంఘం సభ్యులకు 5 గ్రాముల బంగారు నాణాలను అందజేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన, వెంకటస్వామి, కోటేశ్వర్, శ్రీరంగం, రాజేశ్వర్, పూర్ణకుమార్, సత్యనారాయణ, రాజశేఖర్, వేణు, ప్రభాకర్, రవీందర్, రమేష్, సురేష్, చంద్రమౌళి, సదానందం పాల్గొన్నారు.